క్లుప్తంగా

జక్కంపూడికి పృథ్వీ అభినందనలు



జక్కంపూడి గణేష్‌ను సత్కరిస్తున్న పృథ్వీరాజ్ తదితరులు

మండపేట: వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన జక్కంపూడి గణేష్‌కు పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్ అభినందనలు తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం వీవీ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, పార్టీ నాయకులతో కలిసి పృథ్వీరాజ్ పాల్గొని గణేష్‌ను సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, పోతుల దుర్గాప్రసాద్, గనిశెట్టి సత్తిబాబు, గంధం సూరిబాబు, మల్లెల సత్తియ్య, కంచుమర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు సావిత్రీబాయి పూలే

మండపేట: తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా మహిళా విద్యకు పునాది వేసిన సావిత్రీబాయి పూలే చిరస్మరణీయురాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ అన్నారు. సంఘ నాయకులు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయం వద్ద ఘనంగా జరిగింది. ఆమె చిత్రపటానికి శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళాభ్యున్నతికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. సంఘ నాయకులు వీరమల్లు శ్రీనువాస్, టేకి శ్రీనువాస్, చుక్కల అప్పారావు, కింతాడ హేమసుందర శ్రీనువాసు, వాడపల్లి చినబాబు, నరేంద్ర, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వెదురుమూడిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శాంతి

కపిలేశ్వరపురం: పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీలోని స్థలంలో త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి సూచించారు. వెదురుమూడి సచివాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం వివరాలను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో స్థలం పొందిన వారిలో 18 మంది ఇళ్లు నిర్మించుకునేందుకు అవస్థలు పడుతున్నట్టు గుర్తించి వారి ప్రభుత్వం తాలూకు సాయాన్ని వివరించామన్నారు. వారి వెంట గ్రామ కార్యదర్శి వెలగల లక్ష్మి, వీఆర్వో సాకా సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: తోటపేట తోట త్రిమూర్తుల నగర్‌కు చెందిన పులిదిండి నాగసాయి దుర్గారావు(27) కాకినాడా జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తోటపేటలో ట్యాంక్ వాచర్‌గా పని చేస్తున్న నాగసాయి దుర్గారావుకు భార్య, కుమారుడు ఉన్నారు. 3 నెలల క్రితం భార్య దుర్గాపార్వతి కువైట్ వెళ్లింది. అప్పటి నుంచి భార్యకు పదేపదే ఫోను చేస్తుండడంతో ఆమె నెట్ ఆఫ్ చేయడంపై మనస్థాపం చెంది ఈ నెల 2న గడ్డిమందు తాగాడు. అతనిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా, మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని సోదరుడు పులిదిండి నాగబైరవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

కాజులూరు: కోలంకలో శుక్రవారం ఉరివేసుకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోలంకకు చెందిన వీరబాబు మద్యానికి బానిసకావడంతో వివాహం కావడం లేదు. దీంతో అతను మనస్తాపం చెంది ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబీకులు గమనించి అపస్మారక స్థితిలోకి చేరుకున్న అతనిని యానం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వీరబాబు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసును గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతిరాతతోనే మన మార్కు

- రాసే విధానం శాస్త్రబద్ధం కావాలి
- విద్యార్థి దస్తూరీ అర్థవంతంగా ఉండాలి
- పరీక్షలు సమీపిస్తున్న వేళ ఉపాధ్యాయుల సూచనలు

కపిలేశ్వరపురం: విద్యా సంవత్సరం చివరకొచ్చింది. విద్యార్థులు ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి, ఈ నెల 15 నుంచి ఇంటర్మీడియట్, మరికొద్ది రోజుల్లో డిగ్రీ థర్డ్ సెమ్ పరీక్షలు రాయనున్నారు. పాఠాన్ని అర్థం చేసుకోవడం, పాఠ్యాంశాలను గుర్తుపెట్టుకోవడంలో ప్రతిభ కనబరిచేవారు తెలివైన విద్యార్థులని అందరూ ప్రశంసిస్తుంటారు. అది కచ్చితంగా మెరుగైన ప్రతిభే. అయితే పరీక్షల్లో మంచి మార్కులు పొందాలంటే అంతకే పరిమితమైతే సరిపోదు. పరీక్షలో అడిగిన ప్రశ్నకు సమాధానం తెలిస్తే సరిపోదు. గుర్తున్న అంశాలను అందమైన అక్షరాలతో సమాధాన పత్రంలో పొందుపరచడం ద్వారా సత్ఫలితాలు పొందొచ్చు. మూల్యాంకనలో పేపర్లను దిద్దే మాస్టారుకు మంచి దస్తూరితో పరీక్ష రాసినవారి సమాధాన పత్రం స్పష్టత ఇస్తుంది. దానివల్ల మెరుగైన మార్కులు వేసే వీలు కలుగుతుంది. పరీక్షల్లో దస్తూరి ప్రాధాన్యతపై ఉపాధ్యాయులు చేస్తున్న సూచనలపై కథనం...



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

వ్యక్తిత్వానికి ప్రతీక



రాత వ్యక్తిత్వానికి ప్రతీక అని మానసిక నిపుణులు చెబుతున్నారు. మనస్సులో కలిగే భావాలు ఆధారంగా రాత పొందిక ఉంటుంది. పరీక్ష రాసేటపుడు ఒత్తిడికి గురైతే ఆ ప్రభావం రాతపై పడుతుంది. అందువల్ల పరీక్ష రాసేటపుడు మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలి. భౌతిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మనస్సుకు బాధ కలిగించే విషయాలకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ చల్లా రవికుమార్, హోమియో వైద్యుడు, మండపేట

అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త వహించాలి



సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండడంతో పాటు అక్షరాలు అందంగా రాయాలి. పేజీ పైభాగం, ఎడమవైపు ఒక అంగుళం మార్జిన్‌ను వదలి పెట్టాలి. తెలుగు అక్షరాలు గుండ్రంగా రాయడం ద్వారా అర్థవంతంగా ఉంటాయి. పదాలు, వాక్యాలు మధ్య తగినంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి.

– గండి స్వామిప్రసాద్, ఫిజికల్ సైన్స్ టీచర్, జెడ్పీ బాయిస్ హైస్కూల్ ద్వారపూడి

వేగంగా రాయాల్సిన పరిస్థితి తెచ్చుకోకూడదు



పరీక్ష రాసే సమయాన్ని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలి. రాయాల్సిన ప్రశ్నలెన్ని? పరీక్షా సమయమెంత? అన్న అంశాలపై విద్యార్థికి అవగాహన అవసరం. పరిస్థితులెలా ఉన్నప్పటికీ సమయాన్ని వృథా చేసుకోరాదు. పరిమితికి మించి వేగంగా రాయడం అనర్థం తెస్తుంది. అందుకోసం ఇప్పటి నుంచే రాతను ప్రాక్టీసు చేసుకోవడం మంచిది.

– వాసంశెట్టి శ్రీనివాసరావు, ఇంగ్లిష్ టీచర్, వల్లూరు హైస్కూల్

ఒత్తిడిని దూరం చేయాలి



ఒత్తిడిని దూరం చేసుకుని పరీక్షకు బయలు దేరాలి. పరీక్ష రాసే విద్యార్థి ప్రశ్నాపత్రంలో ఏ ప్రశ్నలుంటాయా అన్న ప్రశ్నను ఎట్టి పరిస్థితుల్లోనూ వేసుకోకూడదు. అలాంటి ఊహాత్మక ప్రశ్నలు పరీక్ష రాసే తీరుపై రుణాత్మక ప్రభావాన్ని కలిగిస్తుంది. ఇప్పటి వరకూ చదివిన అంశాలపైనే ప్రశ్నలు అడుగుతారన్న ధీమాతో పరీక్ష రాసేందుకు బయలుదేరాలి. ఆ తర్వాత పరీక్షా పత్రాన్ని ప్రశాంతంగా చదువుకుని బాగా రాయగలను అనుకున్న ప్రశ్నలకు సమాధానాలను రాయడం ప్రారంభించాలి.

–సిద్దిరెడ్డి రాంబాబు, పొలిటికల్ సైన్స్ టీచర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మండపేట

శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ



అభ్యర్థి పరీక్షను ఫలప్రదంగా రాయాలంటే ఆ అభ్యర్థి శారీరకంగానూ, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి. అందుకోసం పరీక్షలు అంటే భయాన్ని పోగొట్టుకోవాలి. ఇప్పటికిప్పుడు కొత్తవి చదివే పని పెట్టుకోకూడదు. అప్పుడపుడూ ఒక్కో గ్లాసు చొప్పున రోజుకు మూడు లీటర్ల నీరు తాగాలి. పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి. జీర్ణమయ్యేందుకు అధిక సమయం పట్టే మాంసాహారం, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండటం మంచిది.

–డాక్టర్ కరుణేంద్రకుమారి, వైద్యురాలు, అచ్యుతాపురం పీహెచ్‌సీ

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వాసంశెట్టి శ్యామ్

కె.గంగవరం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, సచివాలయ పరిశీలకుడు వాసంశెట్టి శ్యామ్ అన్నారు. మండల పరిధిలోని పామర్రు, యండగండి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు ప్రస్తుతం సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా గృహసారథులు, కన్వీనర్లు పని చేయాలని తెలిపారు. బూత్ స్థాయిలో ఉండే ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి చేసిన పనులను గురించి ప్రజలకు సవివరంగా తెలియజేయాలన్నారు. వలంటీర్లతో గృహసారథులు, కన్వీనర్లు భాగస్వామ్యులైన ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్‌లో చోడే గోవిందరాజు, వాసంశెట్టి వెంకట దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి సూరిబాబు, సాదా కపిల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.37.66 కోట్లతో మున్సిపల్ బడ్జెట్

- ఆదాయం రూ. 22.94 కోట్లు
- ఖర్చు రూ.28.68 కోట్లు
- అభివృద్ధి పనులకు రూ.17.83 కోట్లు
- ఆమోదం తెలిపిన మండపేట కౌన్సిల్



మండపేట మున్సిపల్ కార్యాలయం

మండపేట: వచ్చే ఆర్థిక సంవత్సరాని(2023–24)కి రూ.37.66 కోట్లతో మండపేట మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ కౌన్సిల్ ఆమోదం పొందింది. ఆదాయం రూ.22.94 కోట్లు కాగా, ఖర్చు రూ.28.68 కోట్లుగా ఉంది. శాఖల నిర్వహణ పోను అభివృద్ధి పనులకు రూ.17.83 కోట్లు కేటాయింపులు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు అంత్య నిల్వగా రూ.14.72 కోట్లు చూపారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ప్రణాళిక సంఘం నిధులు, ప్రభుత్వ గ్రాంట్లు, పన్నుల వసూళ్ల రూపంలో మొత్తం ఆదాయం రూ.22.94 కోట్లుగా ఉంటుందని లెక్కించారు. అంత్య నిల్వ, ఆదాయంతో కలిపి రూ.37.66 కోట్లతో మున్సిపల్ అధికారులు బడ్జెట్‌ను సిద్ధం చేశారు. వివిధ శాఖల నిర్వహణకు రూ.10.84 కోట్లు ఖర్చు చూపించగా, మిగిలిన రూ.17.83 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం అంత్య నిల్వ రూ.8.98 కోట్లుగా చూపించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పన్నుల రూపంలో తలసరి రూ.1,785 రాబడి వస్తుండగా అభివృద్ధి పనులకు తలసరి ఖర్చు రూ. 2,668లుగా పేర్కొన్నారు.

కేటాయింపులు ఇలా..

భవన నిర్మాణాలకు రూ.19 లక్షలు, రోడ్ల నిర్మాణానికి రూ. 3.2 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.2.05 కోట్లు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి రూ.1.25 కోట్లు, శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.5.5 లక్షలు, వీధిలైట్ల నిర్వహణకు రూ.25 లక్షలు, టాయిలెట్స్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.10 లక్షలు, ప్రజారోగ్య నిర్వహణకు రూ.3.6 కోట్లు, మంచినీటి సరఫరాకు రూ.95 లక్షలు, డ్రైన్ల నిర్మాణానికి రూ.1.5 కోట్లు, షాపుల నిర్మాణానికి రూ. కోటి, కొత్త రిజర్వాయర్ నిమిత్తం రూ.10 లక్షలు, భూసేకరణకు రూ. 44 లక్షలు, హెల్త్ బిల్డింగ్ నిర్మాణానికి రూ.2.6 కోట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు రూ.2.3 కోట్లు, అమృత్ పథకం (నీటి వనరుల అభివృద్ధి)కి రూ.కోటి కేటాయింపులు చేశారు. అలాగే ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎస్సీ ప్రాంతాల అభివృద్ధికి (15 శాతం చొప్పున) రూ.62.25 లక్షలు, షెడ్యూల్ తెగలు ప్రాంతాల అభివృద్ధికి (7.5 శాతం చొప్పున) రూ.31.12 లక్షలు, స్త్రీశిశు సంక్షేమ కార్యక్రమాలకు (5 శాతం చొప్పున) రూ.20.75 లక్షలు, దివ్యాంగుల సంక్షేమానికి (3 శాతం చొప్పున) రూ.12.45 లక్షలు, స్లమ్ ఏరియాల్లో కనీస సదుపాయాల కల్పనకు రూ.43.23 లక్షలు కేటాయించారు. ఈ వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్ తెలిపారు.

ఆలయాలు భారతీయ సంస్కృతికి ప్రతీకలు



అభయాంజనేయస్వామి విగ్రహ శిల్పి పడాల రామకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: ఆలయాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. టేకి ప్రధాన రహదారిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. విగ్రహ శిల్పి పడాల రామకృష్ణను సత్కరించారు. వేదమంత్రాలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి, ఆలయ నిర్వాహక కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

యువత ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలి

రామచంద్రపురం రూరల్: అందివచ్చిన ఉపాధి శిక్షణపై సద్వినియోగం చేసుకుని యువత ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని వెల్ల గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు అన్నారు. గ్రామ సచివాలయం ప్రాంగణంలో ఐటీసీ, ప్రథమ్ సంయుక్తంగా నేతృత్వంలో నిర్వహించిన ఉపాధి శిక్షణ అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు రెండు నెలల కాలపరిమితితో అందించే ఒకేషనల్ స్కిల్స్ కోర్సులను అందిపుచ్చుకోవాలన్నారు. సంస్థ మెంటార్స్ కె. శ్రీనివాసు, సీహెచ్ కృష్ణలు, పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్ మాట్లాడుతూ రెండు నెలల పాటు వసతి, భోజనం, యూనిఫాం, శిక్షణకు అవసరమైన స్టడీ మెటీరియల్ అన్నీ ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేత్లానా, డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాస్, గుత్తుల శ్రీను, యువతీ, యువకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా డీ వార్మింగ్ కార్యక్రమం



అంగర హైస్కూల్ హెచ్‌ఎం రాజుకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి

కపిలేశ్వరపురం: ఈనెల 14న తలపెట్టిన డీ వార్మింగ్ కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. అంగర పీహెచ్‌సీని ఆయన శుక్రవారం సందర్శించి కార్యక్రమం ఏర్పాట్లపై వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారితో చర్చించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ అనుబంధ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. పలు పాఠశాలల హెచ్‌ఎంలకు మాత్రలను అందజేశారు. అచ్యుతాపురం పీహెచ్‌సీలో ఏర్పాట్లను ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఎంవీ ప్రకాష్ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఈ రామారావు, ఎంపీహెచ్ఏలు టి.మేరీ, పి.సురేష్, కార్యదర్శి కామేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

రాయవరం: ఈ నెల 14న నిర్వహించే డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ కోరారు. రాయవరం పీహెచ్‌సీలో వైద్యాధికారి అంగర దేవీరాజేశ్వరి ఆధ్వర్యంలో పాఠశాలలకు డీ వార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసు ఆధ్వర్యంలో పాఠశాలలకు, కళాశాలలకు డీవార్మింగ్ మాత్రలను పంపిణీ చేసి, ఆ వివరాలను యాప్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్.రామారావు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా ప్రచురణ

రామచంద్రపురం: ఏపీ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో 21 వార్డులో జరిగే ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితా ప్రచురించారు. ఈ విషయం అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎలక్షన్ అధికారి ఆమోదం మేరకు ఓటర్ల జాబితాను సంబంధిత పోలింగ్ స్టేషన్ వద్ద, సచివాలయం, మున్సిపల్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోను ఉంచడం జరిగిందని కమిషనర్ పేర్కొన్నారు.

రీ సర్వేను వేగంగా పూర్తి చేయాలి



రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సాయిసత్యనారాయణ

కాజులూరు: జగనన్న శాస్వత భూ హక్కు–భూ రక్ష రీ సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ సిబ్బంది వేగంగా పూర్తి చేయాలని మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తహసీల్దారు పర్యటించి సర్వేను పరిశీలించారు. కోలంకలో ఆయన మాట్లాడుతూ కాజులూరు మండలంలో 20 రెవెన్యూ గ్రామాలకు గానూ తొమ్మిది గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి కావచ్చిందన్నారు. కోలంకలో డ్రోన్ ప్రక్రియ సంబంధించి మ్యాంపులు రాకపోవడంతో సచివాలయ సిబ్బందితో గుర్తింపు జరుగుతుందన్నారు. సర్వే నిర్వహణపై తహసీల్దారు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్వో దేగల సుబ్రహ్మణ్యం, సర్వేయర్ సంధ్య, రెవిన్యూ సిబ్బంది వాసంశెట్టి సుబ్బారావు, రవికుమార్, రైతులు తొగరు చంద్రశేఖర్ పలు గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, ఇతర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనతో సాగులో సత్ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అబ్బు

కపిలేశ్వరపురం: క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వరి సాగులో మేలైన ఫలితాలు లభిస్తాయని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు అన్నారు. అంగర ఆర్బీకేలో శుక్రవారం మండల వ్యవసాయ సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో క్షేత్రస్థాయిలో వరి సాగు పరిస్థితులపై చర్చించారు. వరి సాగులో నూతన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న తీరును, నీటి సరఫరా విషయాలను మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ కె.సుబ్బారావు వివరించారు. శివారు ప్రాంతాలకు నీరు అందకపోవడం తదితర సాంకేతిక అంశాలపై తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, నక్కా సింహాచలం మాట్లాడారు. సమస్యలపై వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు వివరణ ఇస్తూ పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు

కాజులూరు: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అధ్యక్షతన వ్యవసాయ సలహామండలి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయ సాధనలో భాగంగా ముఖ్యమంత్రి జగనన్న రైతుల కోసం ప్రతి గ్రామంలోనూ రైతుభరోసా కేంద్రాలను పెట్టి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో వ్యవసాయ సలహా మండళ్లను నియమించారన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు సక్రమంగా అందించేందుకు, వ్యవసాయ రంగానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు, రైతు ఆదాయాన్ని రెట్టింపుచేసేందుకు ఈ కమిటీ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు కొతాని గణేశ్వర్రావు, టేకుమూడి శ్రీను, మేడిశెట్టి రాము, దంగేటి అరుణ్‌కుమార్, కొప్పుశెట్టి స్వామినాయుడు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న గృహసారథుల కమిటీ పరిశీలకులు తడాల సోమశేఖర్ తదితరులు

కాజులూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోనికి తీసుకువెళ్లేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని గృహసారథుల కమిటీ పరిశీలకుడు తడాల సోమశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పుమిల్లి, దుగ్గుదుర్రు తదితర గ్రామాల్లో పరిశీలకులు పర్యటించి పార్టీలో కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉప్పుమిల్లిలో గ్రామ సర్పంచ్ పెంకే సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సోమశేఖర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం జగనన్న పని చేస్తున్నారని సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లుతో సమష్టిగా పనిచేసి జగనన్న పథకాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల గృహసారధుల కమిటీ కన్వీనర్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, సచివాలయ కన్వీనర్లు ముదుగు రాంజీ, ఒబ్రెయ్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాపనమ్మ ఆలయ వార్షికోత్సవం

మండపేట: పాలతోడులోని బాపనమ్మ తల్లి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పంచాయతీ సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిల్లా అరవరాజు దంపతులు, ఆలయ ధర్మకర్త యేలేటి వెంకట్రావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామంతో పాటు వెలగతోడు, ఇప్పనపాడు తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ పురోహితులు కడిమెళ్ల కృష్ణమూర్తిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. అన్నందేవుల గోపాలరావు, నిమ్మలపూడి వీరన్నచౌదరి, పిల్లా లక్ష్మణరావు, అన్నందేవుల వెంకటేశ్వరరావు, అన్నందేవుల బుజ్జి, యేలేటి రామచంద్రరావు, దొడ్డా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సహకాలు



రైతులకు ప్యాకెట్ల అందజేస్తున్న వైస్ ఎంపీపీ మదుబాల, సర్పంచ్ సునీత తదితరులు

కె.గంగవరం: పాడి రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని, పాడి సంపదను వృద్ధి చేసుకోవాలని వైస్ ఎంపీపీ నీతిపూడి మదుబాల, సర్పంచ్ చీకట్ల సునీత అన్నారు. పాణింగపల్లి గ్రామంలో శుక్రవారం పామర్రు పశువైద్యశాల ఆధ్వర్యంలో ఉచితం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడుతూ పాడి రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1962 నంబర్‌కు ఫోన్ చేసి వైద్యసేవలు పొందాలని, ద్రాక్షారామలో ఉన్న ల్యాబ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పామర్రు పశువైద్యురాలు ఎం.బిందు గ్రామంలో 87 పాడి పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. దీంతో పాటు కాల్షియం, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పాడి రైతులకు అందించారు. పశువైద్యులు ఎం.కృష్ణార్జున్, జి.సురేష్‌బాబు, పాడి రైతులు పాల్గొన్నారు.